క్లుప్తంగా

చెరువును సుందరీకరిస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


అలుగు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

కేశంపేట: పెద్ద చెరువును సుందరీకరణ చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి గ్రామాల శివారులోని పెద్ద చెరువు అలుగు పారడంతో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెరువును త్వరలోనే సుందరీకరణ పూర్తిచేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, స్వాతి బాలీశ్వర్, సురేశ్‌రెడ్డి, కృష్ణయ్య, రమేశ్, శివ, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్

కేశంపేట: మండల పరిధిలోని దేవునిగుడితండా గ్రామంలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పెళ్లికాని యువతులు తొమ్మిది రోజుల పాటు ఎంతో పవిత్రంగా భక్తిభావనలతో ఈ పండగను నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్‌లు వేర్వేరుగా ఉత్సవాల్లో పాల్గొన్నారు.

పాటుకాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సాయిరెడ్డి చెరువు నుంచి కుమ్మరికుంట వరకు ఉన్న పాటు కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని మత్స్యకారులు అధికారులను కోరుతున్నారు. మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నా చెరువుల్లోకి పూర్తిస్థాయిలో వరదనీరు చేరడం లేదని వాపోతున్నారు. రియల్ వ్యాపారులు, పరిశ్రమల నిర్వాహకులు పాటు కాల్వలను ధ్వంసం చేయడంతో పాటు దారి మళ్లించడంలో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి చెరువుల్లోకి వరదనీరు వచ్చేందుకు ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన పాటు కాల్వలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

భూములకు పరిహారం అందించాలి

నిరసన వ్యక్తం చేసిన బాధితులు


నిరసన తెలుపుతున్న బాధితులు

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణలో భాగంగా చేవెళ్లలోని లక్ష్మీనగర్ వెంచర్ వద్ద ప్లాట్లు కోల్పోతున్న బాధితులందరూ ఆదివారం సమావేశమై తమకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రోడ్డు విస్తరణకు 2018లో భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చినా ఇప్పటివరకు తమకు పరిహారం అందలేదని వాపోయారు. ఈ వెంచర్‌లో నుంచి రోడ్డు విస్తరణ మార్కింగ్ చేసి హద్దులు పాతారన్నారు. ఈ బైపాస్ రోడ్డుకు సంబంధించిన పలువురు రైతులకు పరిహారం అప్పట్లోనే అందించారన్నారు. కానీ తమకు మాత్రం పైసా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నోటిఫికేషన్ రాకముందే ఈ వెంచర్ గ్రామ పంచాయతీ అనుమతితో చేశారన్నారు. అప్పుడు పైసా పైసా కూడబెట్టుకొని ప్లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. తీరా ఇప్పుడు ప్రభుత్వం ఈరోడ్డు కోసం ఈ ప్లాట్లను తీసుకుంటున్న పరిహారం మాత్రం చెల్లించటం లేదన్నారు. తమకు పరిహారం రాకుండా ఈ వెంచర్‌లో నుంచి పనులు చేపడితే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫైల్స్‌ను ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు అందజేశామని బాధితులు తెలిపారు. కానీ అధికారులు మారుతున్నా తమ సమస్య తీరటం లేదని కొత్తగా వచ్చిన అధికారులను అడిగితే మళ్లీ ఫైల్ తీసుకురావాలని అంటున్నారే తప్పా పని మాత్రం చేయటంలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేయాలని కోరారు. బాధితులు రాజశేఖర్‌రెడ్డి, బస్వరాజ్, సందీప్‌కుమార్, కిరణ్, ప్రతాప్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమృత, శ్రీదేవి, నజీరసుల్తానా, షా ఫర్హన్, సయ్యద్ జీశాన్ ముస్తఫా, సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


చేవెళ్లలోని అంబేడ్కర్ కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు


షాబాద్: మద్దూరులో..


షాబాద్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

జయములివ్వు బొజ్జగణేశా..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో శనివారం వాడవాడలా గణనాథులు కొలువయ్యారు. ఈ సందర్భంగా భక్తజనం లంబోదరుడికి భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు చేశారు. నిర్వాహకులు మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాలతో వీధులన్నీ సందడిగా మారాయి. గణనాథుడి నామస్మరణలు మార్మోగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం స్థానికులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మండపాలకు చేరుకొని గణపతి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి జయములివ్వు బొజ్జగణేశా అంటూ వేడుకున్నారు.


కొందుర్గు: రావిర్యాలలో పూజలు చేస్తున్న చిన్నారులు


చేవెళ్లలోని వెంకటరమణ కాలనీలో..


చేవెళ్లలోని మల్లికార్జున కాలనీలో..


మొయినాబాద్: పూజల్లో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు


మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


కొత్తూరు: హనుమాన్ ఆలయంలో గణనాథుడికి పూజలు చేస్తున్న నాయకులు, సభ్యులు


షాబాద్: రుద్రారంలో పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు


షాద్‌నగర్: కాలేజీ రోడ్డులోని గణేశ్ మండపం వద్ద ఎమ్మెల్యే పూజలు


షాద్‌నగర్: న్యూసిటీ కాలనీలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


షాబాద్‌లో..

శాశ్వత పరిష్కారం చూపాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- మోకిలలోని విల్లాల పరిశీలన

శంకర్‌పల్లి: మండలంలోని మోకిల లా పలోమా విల్లాలలోకి వర్షపునీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి శనివారం ఆ విల్లాలను పరిశీలించి, యజమానులతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మోకిలలో రైతుల పట్టా భూముల నుంచి ప్రకృతి సిద్ధంగా ప్రవహించే నాలాలు, కుంటలు విరివిగా ఉండేవన్నారు. కాలక్రమేణా విల్లాల నిర్మాణంలో భాగంగా వాటి ప్రవాహానికి అడ్డుగా ప్రహరీలు నిర్మించడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రెవెన్యూ, నీటిపారుదల అధికారులు స్పందించి ప్రకృతి సిద్ధంగా ప్రవహించే కాలువలు, కుంటలను గుర్తించి ప్రవాహానికి వీలుగా కాలువలు నిర్మించాలని సూచించారు. ఆమె వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్, మహారాజ్‌పేట్ మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, లింగం తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- గుంతలమయంగా మొయినాబాద్–చిలుకూరు దారి
- నిధులు మంజూరైనా సాగని పనులు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్: మొయినాబాద్–చిలుకూరు రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై రెండేళ్లు దాటినా పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. చిలుకూరు నుంచి మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు రోడ్డు అభివృద్ధికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. సురంగల్ నుంచి మొయినాబాద్ వరకు బీటీ రోడ్డు వేశారు. మొయినాబాద్ నుంచి చిలుకూరు వరకు కొంత దూరం కంకరపోసి వదిలేశారు. ఆరోడ్డు మట్టిరోడ్డు కావడంతో గుంతలమయంగా మారింది. వర్షం కురిసినప్పుడు నీళ్లు రోడ్డుపై నిలిచి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా మొయినాబాద్–చిలుకూరు రోడ్డు

నిండుకుండలా ఈసీ, మూసీ వాగు


ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు

మొయినాబాద్‌రూరల్: ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాలకు ఈసీ, మూసీ వాగులు నిరంతరం పారుతూనే ఉన్నాయి. అనంతగిరి కొండల్లో మొదలైన ఈసీ, మూసీ వాగులు వికారాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఈ వాగులు గతవారం రోజుల నుంచి పారుతుండడంతో జంట జలాశయాలైన గండిపేట్, హిమాయత్‌సాగర్ చెరువులు నిండుతున్నాయి. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్ సమీపంలో ఈసీ వాగు నిండుగా పారుతూ ప్రవహించడంతో హిమాయత్‌సాగర్ చెరువులోకి భారీగా నీరు చేరుతోంది. చిన్నమంగళారం సమీపంలోని మూసీవాగు అదే తరహాలో ప్రవహిస్తుండడంతో గండిపేట చెరువు నిండుకుండలా మారుతోంది.

వర్షానికి కూలిన ఇళ్లు


కూలిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంధ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్

మొయినాబాద్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు గ్రామాల్లో ఇళ్లు, ప్రహరీలు కూలాయి. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన కాడిగళ్ల నర్సింహ, జంగం సామయ్యకు చెందిన రెండు పెంకుటిళ్లు శనివారం కూలిపోయాయి. రోజు కురుస్తున్న ముసురు వర్షాలకు ప్రహరీలు బాగా తడిసి కూలిపోయాయి. ఇళ్లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి గాయాలు కాలేదు. కానీ ఇళ్లలో ఉన్న వంట సామగ్రి, బీరువాలు, ఇతర వస్తువులు దెబ్బతిన్నాయి. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల ప్రహరీ సైతం వర్షాలకు తడిసి కూలిపోయింది. కూలిన ఇళ్లను పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ సంధ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు. ఇళ్లు కూలిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం అందజేస్తామని మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు.

కార్మికులకు న్యాయం చేయాలి

చేవెళ్ల: రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి తగిన న్యాయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండలంలోని ఆలూరులో ఆదివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో రవాణా రంగ కార్మికులకు నష్టపరుస్తూ నూతన న్యాయ సంతతి చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఆటో కార్మికులకు అధిక చలాన్‌లతో వేధించొద్దని కోరారు. న్యాయమైన ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలూరు ఆటో యూనియన్ అధ్యక్షుడు స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి మోజంఖాన్, ఉపాధ్యక్షుడు జంగయ్య, జుబేర్, సహాయ కార్యదర్శి అనిల్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు


షాద్‌నగర్: పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే


మొయినాబాద్: మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మల్లేశ్‌గౌడ్

షాద్‌నగర్: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని పీసీసీ కార్యాలయానికి వెళ్లిన ఆయన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దంగు శ్రీనివాస్‌యాదవ్, కొమ్ము కృష్ణ, కుమరస్వామి, ఎర్రగారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేశ్‌గౌడ్ ఆయనను కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గౌడ కులానికి చెందిన నేత పీసీసీ అధ్యక్షుడిగా నియమితులు కావడం గర్వంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన వెంట గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు తదితరులు ఉన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులే కీలకం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో రెడ్డి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. అజ్ఞానం ,అంధకారం తొలగించి విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దే ఆదర్శ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తాండ్ర విశాల, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, అరుంధతి, మదన్‌మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, ఉమారెడ్డి, మంజుల, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పత్తికి తెగులు.. రైతు కుదేలు

- వర్షాలతో వాడుముఖం పడుతున్న పత్తిమొక్కలు
- ఆందోళనలో రైతన్నలు
- సలహాలు, సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

షాబాద్: వర్షాలతో రైతులు సంతోషపడి, పంటలు సాగు చేశారు. కానీ గత వారంరోజుల పాటు కురుస్తున్న వర్షాలతో పత్తి పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవటానికి అనేక పాట్లు పడుతున్నారు. మండలంలో మొత్తం 35వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు తెగుళ్లు సోకుతూ అన్నదాతను కలవరపెడుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

వివిధ గ్రామాల్లో..

పత్తి చెట్లు తెగుళ్ల బారిన పడడంతో ఎర్రగా మారి ఎండిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మాల్లారెడ్డి, మారియపూరం, తిర్మలాపూర్, మన్‌మర్రి, సంకెపల్లిగూడ, తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, లక్ష్మరావుగూడ, అప్పారెడ్డిగూడ తదితర గ్రామాల్లో పత్తి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి.


పత్తికి వేర్వేరు తెగుళ్లు..

పత్తికి గులాబీ, రసం పీల్చుపురుగు, పచ్చదోమ, తెల్లదోమ సోకడంతో పంట నల్లబారి ఎండిపోతుంది. పత్తి పంట దాదాపుగా 50 నుంచి 60 రోజుల మధ్యలో ఉంది. ప్రస్తుతం పూత, పిందె, కాపు దశలో ఉండడంతో పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. పంటలు చేతికి అందే దశలో తెగుళ్లు సోకడంతో రైతులు ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలోకి వెళ్లిపోయారు. వ్యవసాయ అధికారులు ఇస్తున్న సలహాలు, సూచనలు తీసుకొని రైతులు మందులు పిచికారీ చేయాలి.


మల్లారెడ్డిగూడలో దెబ్బతిన్న పత్తి పంట


తాళ్లపల్లిలో నీట మునిగిన పత్తి పంట


పంటలకు నష్టం



వారంరోజులుగా కురుస్తున్న వర్షంతో పత్తి పంటకు తీవ్రంగా నష్టం జరిగింది. నేను మొత్తం 15ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. దాదాపు 8 ఎకరాల్లో పత్తి పంటకు తెగుళ్లు ఉన్నాయి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుని మందులు పిచికారీ చేస్తున్నాం.

–విజయభాస్కర్‌రెడ్డి, రైతు మారియాపూరం


చేతికి వచ్చేలోగా..



మొత్తం 10ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. చేతికి వచ్చిన పత్తికి తెగుళ్ల బెడద పట్టుకుంది. నివారణకు మందులను వాడుతున్నాం. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అండగా నిలవాలి. ఏ మందులు పిచికారీ చేయాలో సూచించాలి.

–సామ ప్రతాప్‌రెడ్డి, రైతు ఎర్రోనిగూడ

చైతన్య పరుస్తాం



భారీ వర్షానికి పత్తి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. మా ఏఈఓలతో కలిసి పత్తి పంటను పరిశీలించాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

–వెంకటేశం, వ్యవసాయాధికారి, షాబాద్